పదిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

విశాలాంధ్ర - పద్మనాభం: పదవ తరగతి ఉత్తీర్ణత శత శాతమే లక్ష్యంగా ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ సందర్శన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి రమణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు రెడ్డిపల్లి, రేవిడి వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి విద్యార్థి చదువుతున్న విధానాన్ని వివిధ అంశాలను పదో తరగతిలో 100% ఉత్తీర్ణత ఎలా సాధించాలి అన్న అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ వ్యాలీ రహదారిలో
దీపావళి దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు

- సమీపంలోనే పెట్రోల్ బంకులు, కళాశాలలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక వ్యాపార సంస్థలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: దీపావళి మందు గుండు సామాన్ల వ్యాపారం కోసం కొంతమంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మారిక వలస సమీపంలో ఓజోన్ వ్యాలీ రహదారిలో భారీగా దీపావళి సామాగ్రి దుకాణాలు ఏర్పాటు కోసం అధికారులను సైతం కదిలిస్తున్నారు. ఒకే రోజు దీపావళి ధమాకా వ్యాపారం చేసుకొని దండిగా డబ్బులు సంపా దించాలన్న కొంతమంది వ్యాపారుల అత్యాశ ఆ ప్రాంతంలో వ్యాపారులకు తీవ్ర అలజడి రేపింది. సమీపంలోనే పెట్రోల్ బంకులు, కళాశాలలు, ఉన్నాయని మోడ్రన్ కబేలా వంటి సంస్థలు కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయని ఈ ప్రాంతంలో ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయా వ్యాపార సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మధురవాడ ఫైర్ క్రాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జోనల్ కమిషనర్‌ను, పోలీసులను కోరడంతో వారు ఆ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. గత ఏడది కూడా ఇక్కడే దీపావళి సామాగ్రి దుకాణాలు

ఏర్పాటు చేశామని ఈసారి కూడా ఇక్కడే అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. అయితే మరోవక్క అసోసియేషన్‌లో కొంత మంది దుకాణాల పర్మిషన్ పేరిట భారీగా వసూళ్లకు పాల్పడినట్లు కొంతమంది వ్యాపారులు ఆరోపిస్తున్నారు. స్థానిక పోలీసులకు, స్థానిక జీవీఎంసీ అధికారులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు కొంత మొత్తం ఇవ్వాలని షాపుకు 50 వేలు నుంచి లక్ష రూపాయలు వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. దీపావళి కొనుగోలుదారులపై ధరల మోత పడేలా, దుకాణదారులు భారీ లాభాలకు అధిక సంఖ్యలో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు కూడా అత్యుత్సాహం చూపి ముడుపులు వస్తాయన్న ఆశతో ఫైర్ క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఎనలేని సహాయ సహకారాలు అందిస్తున్నారు తప్ప, స్థానిక వాణిజ్య సంస్థలకు ఇబ్బందులను గుర్తించడం లేదని కొంతమంది ఫిర్యాదు చేస్తున్నారు.

యువత ప్రత్యేక లక్ష్యంతో
ముందుకు సాగాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: యువత ప్రత్యేక లక్ష్యంతో ముందుకు సాగాలని, అలా కాని పక్షంలో జీవితంలో ఏమీ సాధించలేమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. నీతి, నిజాయితీగా, మంచి పౌరుడుగా ఉండాలని, సమాజానికి భారం కాకుండా బ్రతకాలని హితవు పలికారు. జీవితంలో ఎదిగేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కష్టపడకుండా ఏదీ రాదని, ఒకవేళ వచ్చినా ఎక్కువ కాలం నిలవదని అన్నారు. ప్రత్యేక లక్ష్యం పెట్టుకొని దాని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. సెట్విస్, ఎన్.వై.కె. ఆధ్వర్యంలో కృష్ణా కాలేజీలో గురువారం జరిగిన యువజనోత్సవాల్లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు సందేశం అందించారు. చదువుతోపాటు కళలపై కూడా యువత దృష్టి సారించాలని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు శ్రమించాలని సూచించారు. తాత్కాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవాలని, సింగిల్ పాయింట్ నినాదంతో పని చేయాలని హితవు పలికారు. మనం పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏయే పనులు చేయాలో నిర్ణయించుకోవాలన్నారు. నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీల్లో, కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో సెట్విస్ సీఈవో కవిత, యూత్ ఆఫీసర్ మహేశ్వరరావు, కృష్ణా కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: గొట్టిపల్లి ఎంపీపీ స్కూల్ (మోడల్ స్కూల్) విద్యార్థులకు గురువారం దాత సౌజన్యంతో ఉచిత నోటు పుస్తకాలను, ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు. దాత దుబాయ్‌కి చెందిన లక్కొజు శేషాద్రి కుమారుడు రిషిరామ జన్మదినం పురస్కరించుకొని 70 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌ను పాఠశాల హెచ్ఎం గోవింద్ కుమార్‌కి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, టీడీపీ యువ నాయకుడు ఎర్ర బంగారు నాయుడు (బన్నీ), శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, కో కన్వీనర్ డిపి రాజు, పాఠశాల హెచ్ఎం గోవింద్ కుమార్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బుత్తల కుమారి, ఉపాధ్యాయులు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: దీపావళి పండుగ సందర్భంగా బాణ సంచా నిల్వలు, దుకాణాల ఏర్పాటు, అమ్మకాలలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. బాణాసంచా అమ్మకందారుడు లైసెన్స్ కోరకూ నియమ నిబంధనలను భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నగరవాసులు వారివారి పరిసర ప్రాంతాలలో అనధికారిక బాణాసంచా నిల్వ చేస్తున్నారనే అనుమానం ఉంటే నేరుగా డయల్ - 100/112 కు గాని, సీపీ ఫోన్ నెంబర్ 7995095799 గాని లేదా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కి సమాచారం అందించాలన్నారు/ అలా సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచి ,అనధికారిక బాణాసంచా నిల్వ చేస్తున్నవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు.

సూపర్ జీఎస్టీ
సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - పెందుర్తి: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై గురువారం పెందుర్తి కూడలిలో కూటమి నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జి, మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపుతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జనసేన నాయకుడు వేగి దివాకర్‌రావు అన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీడీవో, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, జీఎస్టీ అధికారులు కృష్ణవేణి, ఉత్తర కుమార్, కూటమి నాయకులు, ఆటో డ్రైవర్స్, టాటా ఏసీ డ్రైవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ కిరాణా సామాగ్రి మీద గతంలో 18 శాతం జీఎస్టీ ఉంటే ఇప్పుడు 5 శాతానికి తగ్గించారని తెలిపారు. అలాగే రోజువారీ నిత్యావసరాలు మీద 18 పర్సెంట్ ఉంటే అది 5 శాతానికి, మందులు 18 శాతం నుండి జీరో శాతానికి, దుస్తులు పాదరక్షలు, స్టేషనరీ 12 పర్సెంట్ నుండి 5 శాతానికి తగ్గించారని వెల్లడించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర - మధురవాడ: సామాన్యులకు వైద్యసేవలు చేరువచేసే లక్ష్యంతో నెలకొల్పిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు భాగస్వామ్యం లోకి తెచ్చే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సామాజిక బాధ్యతగా చేపట్టి విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు నాయకులు గురువారం పిలుపునిచ్చారు. భీమిలి నియోజకవర్గం ఎండాడ వైసీపీ కార్యాలయంలో విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి వైసీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధ్యక్షతన 5,6,7,8 వార్డులతో పాటు భీమిలి నియోజకవర్గం వైసీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల బాధలు పట్టడం లేదని మండిపడ్డారు. కేజీహెచ్‌ను కూడా ప్రైవేటుపరం చేసే ప్రమాదముందన్నారు. రాష్ట్రంలో పేదవాడికి విద్య, వైద్యం అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కార్పొరేటర్ అక్రమాన రాము నాయుడు, వార్డు ప్రెసిడెంట్ జగ్గుపల్లి ప్రసాద్, 2వ వార్డ్ అధ్యక్షులు చిల్ల భాస్కర్ రెడ్డి, జీరు వెంకటరెడ్డి, అక్రమాన మంగరాజు, అల్లిబిల్లి నరసింగరావు, గుండా మధు, యెల్లాజీ, టి.కొండబాబు, పాలు రమణారెడ్డి, పోతిన హనుమంతు, పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, తైనాల విజయ్ కుమార్, పెదబాబు, భీమిలి ఎంపీపీ వాసు రాజు, మండల పార్టీ ప్రెసిడెంట్ గాడు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, చెన్నా దాస్, రోషి రెడ్డి, పెండాలం పద్మావతి, పిల్ల సుజాత, చెరుకూరి రజని, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అప్పగించి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. గురువారం 3, 4 జోన్ల పరిధిలోని 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. జోన్ -3 పరిధిలో మద్దిలపాలెం జంక్షన్ నుండి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకు కిరువైపులా పరిశుభ్రత పనులను ఆయన పరిశీలించారు. స్పెన్సర్స్ జంక్షన్ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు గమనించిన కమిషనర్, అసంతృప్తి వ్యక్తం చేసి వెంటనే చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టారు. 29వ వార్డులో దండు బజార్ వద్ద జీవీఎంసీ వార్డ్ కార్యాలయాన్ని సందర్శించి, పారిశుధ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు నిరంతరం సహకరించాలని

ఆయన సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది సమయానికి డ్యూటీకి హాజరు కావాలని, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ శానిటరీ సెక్రటరీలు రోజువారీ పర్యవేక్షణ చేపట్టి నగరాన్ని చెత్త రహితంగా ఉంచాలని ఆయన ఆదేశించారు.

ఏయులో సూపర్ జీఎస్టీ షాపింగ్ ఫెస్టివల్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహనలో భాగంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. బెలూన్లు ఎగుర వేసి షాపింగ్ ఫెస్టివల్ జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. స్టేట్ జీఎస్టీ అదనపు కమిషనర్ సీతారాం శేఖర్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, యుసిడి పీడీ సత్యవేణి, డిఆర్డిఏ పీడీ లక్ష్మీపతి, జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ ఒక మంచి ఫ్లాట్ ఫామ్‌గా నిలుస్తుందని విశ్వసిస్తున్నాను అన్నారు.స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించడంలో జీఎస్టీ 2.0 చుక్కానిలా దోహదపడుతుందని, విశాఖను మరింత మెరుగైన నగరంగా తీర్చి దిద్దడంలో ది గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ మైలు రాయిగా నిలుస్తుందని తెలిపారు.

ఎన్.ఎస్.టి.ఎల్‌లో షిప్ డిజైన్ వర్క్‌షాప్

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్‌లో "స్వావలంబనను ప్రోత్సహించడానికి, స్వదేశీ నౌక రూపకల్పన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి షిప్ డిజైన్ వర్క్ షాప్"ను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, ప్రధాన నావికా పరిశోధన ప్రయోగశాల నావల్ సైన్స్, టెక్నలాజికల్ లాబొరేటరీ నిర్వహించింది.

భారతదేశ స్వదేశీ నౌక రూపకల్పన సామర్థ్యాలను బలోపేతం చేయడం, భారత నౌకాదళం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, వర్గీకరణ సంఘాలు, విద్యాసంస్థల నుండి వాటాదారుల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ మరియు కార్యాచరణ ప్రమాణాలకు అనుగుణంగా నావికా రూపకల్పనను సమలేఖనం చేయడానికి గ్రీన్ షిప్ టెక్నాలజీస్, ఇంధన-సమర్థవంతమైన ప్రొపల్షన్ సిస్టమ్స్, స్థిరమైన పదార్థాల యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) డాక్టర్ ఆర్.వి.హర ప్రసాద్, వర్క్‌షాప్ డిజైన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ రియర్ అడ్మిరల్ సుజిత్ బాక్సీ, ఎం.ఎస్.టి.ఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సి.ఎం.డి గిరిదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విభాగాలు, కార్యాలయాలను ఏయూ వీసీ తనిఖీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నేడు పలు విభాగాలను, కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. కార్యక్రమంలో భాగంగా మెటీరియాలజి, ఓషనోగ్రఫీ విభాగాలను తనిఖీ చేసారు. అక్కడ బోధనా, బోధనేతర సిబ్బంది యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా విభాగంలో తరగతులు జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు. విభాగపు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విభాగ అవసరాలకు సంబంధించి ఏమైనా అవసరాలు ఉంటే తమదృష్టికి తేవాలని సూచించారు. వాతావరణ శాస్త్ర విభాగం ప్రాంగణంలో ఉన్న కాలుష్య తనిఖీ వాహనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వాహనానికి అవసరమైన డ్రైవర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సంబంధిత విభాగానికి లేఖ రాయాలని సూచించారు. అదే విధంగా ఐఐటీఎంతో ఇటీవల చేసుకున్న ఒప్పందంలో భాగంగా కొన్ని సాంకేతిక పరికరాలు ఇప్పటికే ఏయూకు చేరాయి. వీటి ఇనస్టలేషన్ పనుల ప్రగతిని వీసీ అడిగి తెలుసుకున్నారు. ఈ పరికరాలు ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సరఫరా వ్యవస్థను ముందుగా ఏర్పాటు చేసుకోవాలని, ఐఐటీఎం నుంచి ఇనస్టలేసషన్ ఇంజనీర్లను పిలచి నూతన పరికరాలను ఇనస్టలేషన్ చేయించాలని తెలిపారు. అదే విధంగా ఇంజినీర్స్ కార్యాలయాన్ని సైతం ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడ అధికారులు, ఇతర సిబ్బంది యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. పూర్తి నిబద్ధతతో విధులను నిర్వహించాలని సూచించారు.

గూగుల్ రాకతో విశాఖకు మహర్ధశ

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రెన్ సర్కార్ పాలనతో విశాఖ ముఖచిత్రం మారబోతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థత, ఐటి శాఖామంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించే విధంగా కూటమి సర్కార్ చేస్తున్న కృషి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. 2014-19 కాలంలో విదేశీ పెట్టుబడులతో రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో కియా మోటర్స్ ఏర్పాటు చేశారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కోసం వైసీపీ రాద్ధాంతం చేస్తుందని అన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో నాణ్యత, పేద పిల్లలకు 50 శాతం సీట్లు కేటాయించడం వంటి నిర్ణయాలు కారణంగా పిపిపి పద్ధతులను కూటమి సర్కార్ అవలంబించిందని అన్నారు.

పది ఉత్తీర్ణతా శాతంపై జిల్లా విద్యాశాఖ కసరత్తు

విశాలాంధ్ర - సింహాచలం: 10వ తరగతిలో విశాఖపట్నం జిల్లాలో 2026 మార్చిలో జరగబోవు 10వ తరగతి పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను సమాయత్తం చేయడానికి వినూత్న ప్రక్రియను ప్రారంభించింది. అందుకు గ్రామ సందర్శన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారితో సహా జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా ఉప విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందాలుగా ప్రతి మండలంలోని రెండు గ్రామాలలోని పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి చర్చిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతకు, మంచి మార్కుల సాధనకు చేపట్టవలసినటువంటి కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రేమ్ కుమార్ అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో వారి వారి ఇళ్ల వద్ద కలిసి వారి ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమయం దగ్గరికి వస్తోందని తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తరగతి గదిలో క్రమశిక్షణతో ప్రశాంతంగా మెలగాలన్నారు. పాఠాలను ఎప్పటికప్పుడు పునఃశ్చరణ చేసుకుంటూ ధారణ శక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రవీంద్ర బాబు, అనురాధ, ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు, డిసిఈబి కార్యదర్శి కృష్ణ కుమార్, సీఎమ్ఓ దేవుడు బాబు, సమగ్ర శిక్ష ఏపీఓ అప్పలనాయుడు, ప్రధానోపాధ్యాయులు లలిత, ఉషారాణి, గీతా దేవి, చినగదిలి మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనాభం టీవీఎస్ షోరూం ఘరానా మోసం

వినియోగదారులను బురిడీ కొట్టించిన షోరూం
కేసు నమోదు చేసిన సీఐ శ్రీధర్

విశాలాంధ్ర పద్మనాభం: పద్మనాభం మండలంలో ప్రముఖ టీవీఎస్ షోరూం వారు వినియోగదారులకు బురిడీ కొట్టి టోపీ పెట్టారు. వినియోగదారులు పూర్తి డబ్బు చెల్లించి వాహనాలు కొనుక్కుంటే వారు కొనుక్కున్న వాహనాలకు ఫైనాన్స్ పెట్టి, సుమారు తొమ్మిది లక్షల రూపాయలు కొల్లగొట్టారు. విషయం తెలిసిన వినియోగదారులు టీవీఎస్ షోరూం యజమాని పైల శ్రీనివాసరావును నిలదీయగా షోరూం యజమాని శ్రీనివాసరావు సిబ్బందిని ఆరా తీయగా అవనాపు చంద్రశేఖర్ ఈ దారుణానికి వడిగట్టినట్లు నిర్ధారించి స్థానిక పోలీస్ స్టేషన్లో అవునాపు చంద్రశేఖర్‌పై ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. సుమారు పది వాహనాలకు పూర్తిగా వినియోగదారులు డబ్బులు చెల్లించినప్పటికీ వాటికి ఫైనాన్స్ పెట్టి రెండు నెలలు ఈఎంఐ కట్టి మూడో నెల చేతులు ఎత్తేసరికి ఫైనాన్స్ కంపెనీ వారు ఫోన్ చేయడంతో వినియోగదారులకు టీవీఎస్ షోరూం సిబ్బంది మోసం తెలియ వచ్చింది. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ షోరూం యజమానికి తెలియకుండా ఇంత భారీ ఎత్తున మోసం జరుగుతుందా అని వినియోగదారులు వారి గోడును వెల్లబుచ్చుకున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: నగరంలోని అక్కయ్యపాలెం నందగిరి నగర్‌లో సంచలనం సృష్టించిన మహిళా హత్య కేసు నిందితుడిని కొద్ది గంటల్లోనే పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. గురువారం మధ్యాహ్నం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ కే.లక్ష్మణమూర్తి కేసు వివరాలు వెల్లడించారు. అక్కయ్యపాలెం, నందగిరి నగర్‌కు చెందిన కావల శ్రావణ సంధ్య (33) అలియాస్ సోనీకి భర్త మణికంఠతో 9 సంవత్సరాల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడం వలన శ్రావణ సంధ్య గత ఏడు సంవత్సరాలుగా భర్తకు దూరంగా ఉంటుంది. ప్రస్తుతానికి ఆమె భర్త మణికంఠ రాయగడలో ఉంటున్నాడు. ఈ తరుణంలో బుధవారం సాయంత్రం శ్రావణ సంధ్యను అదే వీధిలో ఉంటున్న కార్పెంటర్ శ్రీను పదునైన కత్తితో దాడి చేసి మెడపైన కోసి వేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. అనంతరం నిందితుడు సంఘటనా స్థలం నుండి పారిపోగా కొద్ది గంటల వ్యవధిలోనే పోలీసులు శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. మృతురాలు అక్క దేవి సంతోషి కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు మర్డర్ కేస్ నమోదు చేశారు. మృతురాలు శ్రావణ సంధ్య, నిందితుడు శ్రీనుకి గత ఎనిమిది నెలలుగా బైక్ పార్కింగ్ విషయంలోగొడవలు ఉన్నట్టు ఏసీపీ వెల్లడించారు. అందులో భాగంగా మృతురాలు బైక్ సీట్ కవర్‌ని నిందితుడు కోసివేయడం, ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైందని పోలీసులు విచారణలో వెల్లడైనట్లు ఎసిపి తెలిపారు. అప్పటి నుండి ఇద్దరికీ తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో తన జేబులో ఉన్న కత్తితో మృతురాలి పీక కోసి శ్రీను హత్య చేసినట్టు వివరించారు. కొద్ది నెలలుగా తనతో శ్రీను గొడవ పడుతూ, అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని మృతు రాలు స్థానిక పోలీసులను పలుమార్లు ఆశ్రయించి గోడు చెప్పుకుందని స్థానికులు చెబుతున్నారు. సకాలంలో పోలీసులు స్పందించి నిందితుడు శ్రీనును అదుపులోకి తీసుకొని చర్యలు తీసుకుని ఉంటే ఓ నిండు ప్రాణం బలయ్యేది కాదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సమావేశంలో సీఐ ఉమాకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలకు ఊరట కలిగిస్తూ తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కల్పిస్తూ గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నుంచి సాగిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 100 వరకు పాల్గొన్న వాహనాలు ఆర్కే బీచ్, ది పార్క్ హోటల్ మీదుగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకున్నాయి. యువత ఉత్సాహంగా బైక్ లు నడుపుతూ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ దుష్యంత్, రవాణా శాఖ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన డీకన్ స్ట్రక్ట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: హైలీ ఎఫెక్టివ్, యెట్ జెంటిల్' ఫిలాసఫీగా ప్రముఖ చర్మ సంరక్షణా సంస్థ డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ అధికారికంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను బద్దలు కొట్టింది. ఈ మేరకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్ అడ్జుడికేటర్ స్వాప్నిల్ దంగారికర్ చేతుల మీదుగా డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ వ్యవస్థాపకురాలు మాలిని అడపురెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ 24 గంటల డెర్మథాన్ ద్వారా 'ది లాంగెస్ట్ స్కిన్‌కేర్ లైవ్‌స్ట్రీమ్' కోసం కొత్త టైటిల్ ను సెట్ చేసిందని చెప్పారు. మారథాన్ యూట్యూబ్ లైవ్ సెషన్ లో 24 మంది చర్మవ్యాధి నిపుణులు పాల్గొన్నారని, దేశవ్యాప్తంగా 30,000 మంది పాల్గొన్నారన్నారు. ఈ లాంగ్ మారథాన్ 500,000 కంటే ఎక్కువ రియల్ టైమ్ ఇంటరాక్షన్‌లను సృష్టించిందని, వీటిలో 200,000 చర్మ సంరక్షణ ప్రశ్నలు ఉన్నాయి. 10,000 మందికి ప్రత్యక్షంగా సమాధానాలు ఇవ్వబడ్డా యన్నారు. 24 గంటల ప్రత్యక్ష ప్రసారం విజయవంతంగా పూర్తయిన తర్వాత ఈ రికార్డును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ (టీఎం) అధికారికంగా గుర్తించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి చర్మ సంరక్షణ నిపుణులు 24 గంటల పాటు, డాక్టర్ అనుప్రియ గోయెల్, డాక్టర్ నేహా సోలంకి, డాక్టర్ ఆదిత్య వాలింగ్కర్, డాక్టర్ రాధిక త్రివేది, డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ రాశి సోని, డాక్టర్ విదేహి వంటి వారు మొటిమలు, పిగ్మెంటేషన్, సన్ ప్రొటెక్షన్, పదార్థాలపై అవగాహన, బిగినర్స్ రొటీన్ బిల్డింగ్ వంటి విస్తృత శ్రేణి చర్మ సంరక్షణ సమస్యలను పరిష్కరించారన్నారు. వీక్షకులు యూట్యూబ్ లైవ్ చాట్ ద్వారా రియల్ టైమ్ లో నిపుణులతో సంభాషించారన్నారు.

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- పెందుర్తి: విశాఖ నగరంలో 2025 డిసెంబర్ 31 నుంచి జనవరి 4, 2026 వరకు జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేసారు. గురువారం జీవిఎంసీ 97వ వార్డు, కార్మిక నగర్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడుతూ మహాసభలకు దేశవ్యాప్తంగా 70 లక్షల మంది కార్మికుల సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుండి హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సిఐటియు ఏర్పడ్డ 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయని దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహాసభల చివర రోజైన జనవరి 4 న లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందన్నారు. మహాసభల సందర్భంగా రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.జగన్, జోన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, జోన్ నాయకులు కె.అప్పలనాయుడు, జి.శంకర్రావు, కోలని నాయకులు ప్రభు దేవా, ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025కు 276 కోట్ల కస్టమర్ సందర్శనలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025, భారతదేశం పండుగలను జరుపుకునే, షాపింగ్ చేసే విధానాన్ని మార్చేసింది. ఈ సంవత్సరం, అమెజాన్ ఇండియా 276 కోట్లకు పైగా కస్టమర్ సందర్శనలను నమోదు చేసింది. వీరిలో 70 శాతం మంది టైర్ 2, 3 నగరాల నుండి కావడం విశేషం. 30 రోజుల ఈ వేడుకలో మరో ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉండగా, అమెజాన్ ఇండియా అపూర్వమైన స్పందనను వెల్లడించింది. ఈసారి కాంగ్రా, హరిద్వార్, ముజఫర్‌పూర్, జామ్‌నగర్, డార్జిలింగ్, షిమోగా, సేలం వంటి విభిన్న ప్రాంతాల నుండి దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో విక్రేతలు అమ్మకాలు నమోదు చేశారు. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా, ప్రైమ్ సభ్యులు ప్రత్యేక ఆఫర్లు, డీల్స్, అమెజాన్ యొక్క అత్యంత వేగవంతమైన డెలివరీలను ఆస్వాదించారు. "రికార్డు స్థాయిలో 276 కోట్ల కస్టమర్ సందర్శనలతో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025 మరోసారి కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పింది. భారతదేశపు అత్యంత విశ్వసనీయమైన, ఆదరణ పొందిన ఆన్‌లైన్ షాపింగ్ గమ్యస్థానంగా అమెజాన్ స్థానాన్ని పునరుద్ఘాటించింది. భారతదేశంలోని ప్రతి సర్వీసబుల్ పిన్ కోడ్‌కు మా సేవలు చేరడం మాకు గర్వకారణం, మా కస్టమర్లలో 70 శాతం మంది టైర్ 2, 3 నగరాల వారే. స్మార్ట్‌ఫోన్‌లు, గృహోపకరణాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ నుండి హోమ్ కిచెన్, బ్యూటీ, ఫ్యాషన్ వరకు అన్ని కేటగిరీలలో మా విక్రేతలు, బ్రాండ్ భాగస్వాములు బహుళ రెట్ల వృద్ధిని చూశారు అని అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, సౌరభ్ శ్రీవాస్తవ అన్నారు.

అశోకా యూనివర్శిటీ యూజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - విశాఖపట్నం: అంతర విభాగాల కంప్యూటర్ సైన్స్, నేచురల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ మరియు హ్యుమానిటీస్ లో భారతదేశపు ప్రముఖ సంస్థల్లో ఒకటైన అశోకా యూనివర్శిటీ తమ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించినట్టు ఆ యూనివర్సిటీ ప్రతినిధి వెల్లడించారు. అశోక యూనివర్సిటీలో అన్ని ప్రోగ్రాంస్ లో 500 యోగ్యత మరియు అవసరం ఆధారిత ఉపకారవేతనాలు సైతం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేకమైన యోగ్యతా ఉపకారవేతనాలు (50) జేఈఈ మెయిన్స్, ఐఐఎస్ఇఆర్ (ఐఎటి), సీఎంఐ మరియు ఇండియన్ నేషనల్ ఒలంపియాడ్స్ (ఐ ఎన్ ఓ)లో 50 అసాధారణమైన విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు మాఫీ సౌకర్యం అందచేయబడుతుందన్నారు. ఈ జాతీయ ఆప్టిట్యూట్ పరీక్షల్లో అత్యధిక స్కోర్స్ తో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ప్రత్యేకమైన ఉపకారవేతనాల నుండి ప్రయోజనం పొందుతారన్నారు. అచీవర్స్ మెరిట్ ఉపకారవేతనాలు (150) లో స్కూల్ బోర్డ్ పరీక్షల్లో (సీబీఎస్సీ, ఐసిఎస్సి/ఐఎస్ సి)లో ఉన్నతమైన ప్రదర్శన కోసం వచ్చిన గుర్తింపుతో సమగ్రమైన అశోకా యూనివర్శిటీ అడ్మిషన్స్ ప్రక్రియలో మొత్తం సామర్థ్యం ఆధారంగా ప్రవేశాలు పొందిన 150 మంది విద్యార్థులకు 100 శాతం వరకు ట్యూషన్ ఫీజు మాఫీ సౌకర్యం అందచేయబడుతుందన్నారు. అవసరం ఆధారిత ఉపకారవేతనాలు యూనివర్శిటీ నుండి ఆర్థిక మద్దతు అవసరమైన, ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 100 శాతం అవసరం ఆధారిత ట్యూషన్ ఫీజు/పూర్తి మాఫీ సౌకర్యం అందచేయబడతాయని అన్నారు. ఇప్పటికే ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నాలుగు దరఖాస్తు ప్రక్రియ విడతల్లో జరుగుతుందని, మే 31, 2026న ముగుస్తుందని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర-కవిటి: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్య పడుతుందని ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం రామయ్యపుట్టుగలో విశాఖపట్నం కి గూగుల్ సంస్థ తీసుకొచ్చిన సందర్భంగా టపాకాయలు బాణాసంచా కాల్చి పండుగ చేసుకున్నారు. విశాఖపట్నం కి గూగుల్ సంస్థ తీసుకొచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి,ఐటీ శాఖ మంత్రి లోకేష్,అలాగే కేంద్ర మంత్రి ఎంపీ రామ్మోహన్ నాయుడు దీనికి సహకరించిన ప్రధానమంత్రి మోడీ కి అలాగే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారాం కి మరియు ఉత్తరాంధ్ర ఎంపీలుకు అలాగే ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞత అభినందనలు తెలుపుతూ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అశోక్ ,కవిటి మండలం టిడిపి అధ్యక్షులు పొందల కృష్ణారావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణసంచాలతో పేల్చి , మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయుకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బీచ్ రోడ్‌లో అనస్తిషియా దినోత్సవం అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచ అనస్థీషియా దినోత్సవం, సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా విశాఖపట్నం అనస్థీషియా సొసైటీ, ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కాళీమాత ఆలయం సమీపంలోని బీచ్ రోడ్ లో సీపీఆర్ అవగాహన, అనస్థీషియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పోలీస్ కమిషనర్ డా. శంకర్ బ్రత బాగ్చి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశాఖ అనస్థీషియా సొసైటీ అధ్యక్షురాలు డా. కె.అపరంజి, కార్యదర్శి డా. ప్రవీణ్ కుమార్, కేజీహెచ్‌లో అనస్థీషియా విభాగాధిపతి డా. కె. శ్రీలక్ష్మి, అలాగే విశాఖ నగరంలోని ప్రముఖ అనస్థీషియాలజిస్టులు డా. మోహన్ మహారాజ్, డా. అనురాధ, డా. కుర్మానాథ్, డా. కుచేల్‌బాబు , ఇతరులు పాల్గొన్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం నుండి ప్రొఫెసర్ డా. వి.ఎస్.ఎన్. మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎస్. నవీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రెడ్డి కిరణ్ కుమార్ హాజరయ్యారు. కమిషనర్ సమాజ అభ్యున్నతికి తీవ్రస్థితి రోగులను చికిత్స చేయడంలో అనస్థీషియాలజిస్టులు అత్యవసర వైద్యులు (ఎమర్జెన్సీ డాక్టర్లు) చేస్తున్న కృషిని ప్రశంసించారు. అలాగే, సీపీఆర్ శిక్షణను సంవత్సరంలో 365 రోజులూ ప్రతిరోజూ నిర్వహించాల్సిన అవసరం ఉందని, ప్రధాన ప్రజా ప్రదేశాల్లో ఆటోమేటిక్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే సీపీఆర్‌తో పాటు వాటిని ఉపయోగించే విధానంపై కూడా శిక్షణ ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

మహిళలంటే కూటమి ప్రభుత్వానికి గౌరవం లేదు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మహిళలంటే కూటమి ప్రభుత్వానికి గౌరవం లేదని వైయస్సార్సీపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 16 నెలల పాలనలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల కాలకేయుల్లా మారారని, ముఖ్యమంత్రి చంద్రబాబు అండతోనే ఇంత నీచంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. వైయస్సార్సీపీ మహిళా నేత కృపాలక్ష్మిపై అత్యంత నీచంగా మాట్లాడిన ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆమె ఖండించారు. తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని, సీఎం చంద్రబాబు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక దళిత మహిళపై ఇంత నీచంగా ఎమ్మెల్యే ఏ ధైర్యంతో మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. మీ ఇంట్లో మహిళల గురించి కనీస సభ్యత లేకుండా ఇంత నీచంగా మాట్లాడగలరా అని ఎమ్మెల్యే థామస్ను ప్రశ్నించారు. ఈవీఎంల సాయంతో అడ్డదారిలో ఎమ్మెల్యే అయిన థామస్ విలువలు ఎలా పాటిస్తారని ఏద్దేవా చేశారు. అతనిపై పోలీస్ స్టేషన్లో, మహిళా కమిషన్ లో ఫిర్యాదు చేస్తామన్నారు. కల్తీ మద్యం తయారు చేస్తున్నారని, మీ అన్యాయాలను ప్రశ్నిస్తే దాన్ని జీర్ణించుకోలేక వ్యక్తిత్వ హననానికి దిగుతున్నారని మండిపడ్డారు. కూటమి భాగస్వామి పార్టీ జనసేన నాయకురాలు కోట వినుత ప్రైవేటు వీడియోలు తీయించడానికి ఆమె డ్రైవరుకు ఏకంగా రూ. 60 లక్షలు ఎర చూపారని ఆమె పలుమార్లు ఆవేదవ వ్యక్తం చేశారన్నారు. తాజాగా ఆమె డ్రైవర్ సెల్ఫీ వీడియో ద్వారా మరిన్ని దారుణాలు వెలుగుచూశాయని పేర్కొన్నారు. కోట వినుతను హత్య చేయడానికి కూడా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్లాన్ చేసిన విషయం బయటపడిందన్నారు. ఇవన్నీచూస్తుంటే టీడీపీ ఎమ్మెల్యేలు ఎంత దారుణంగా దిగజారిపోయారో అర్థం అవుతుందన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే మీద చంద్రబాబు, లోకేష్ లు ఎందుకు చర్యలు తీసుకోలేదు. చివరకు కూటమి పార్టీలకు చెందిన మహిళా నేతలకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుగాలీ ప్రీతి హత్య కేసులో సాక్ష్యాలు తారుమారు అయ్యాయని చెబుతున్న పవన్ కళ్యాణ్ అసలు హత్య జరిగిందే తెలుగుదేశం పార్టీ, మీరు అధికారంలో ఉన్నప్పుడు కాదా? మరి ఎందుకు సిబీఐ ద్వారా ఈ కేసు దర్యాప్తు చేయించి ఆ తల్లికి న్యాయం చేయడం లేదని నిలదీశారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేసే బాధ్యత నాది

టిడిపి యువ నాయకులు గంటా రవితేజ

విశాలాంధ్ర - భీమిలి: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తరహాలో భీమిలిలోని నారా చంద్రబాబు నాయుడు ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గంటా రవితేజ అన్నారు. 2018 లో గంటా శ్రీనివాసరావు భీమిలి శాసనసభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో ఈ స్టేడియం నిర్మాణం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఆ తరువాత నిర్లక్ష్యానికి గురికావడంపై భీమిలి నీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో దీనిని అభివృద్ధి చేయాల్సిందిగా, సమస్యలు పరిష్కరించాలని, వుడెన్ కోర్టు ఏర్పాటు చేస్తే ఇక్కడి నుండి శిక్షణ తీసుకున్న వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తారని గతంలో గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అప్పటినుండి గంటా రవితేజ ఈ విషయంపై అహర్నిశలు కృషి చేస్తున్నారు. గురువారం స్టేడియం సందర్శించి వీలైనంత త్వరగా వుడెన్ కోర్టు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవిఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ అప్పలరాజు, స్థానిక కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, టిడిపి నాయకులు గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, భీమిలి నీడీ వెల్ఫేర్ సభ్యులు కాళ్ళ సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, శిక్షణ తీసుకుంటున్న వారి తల్లిదండ్రులు వర్మ, శివశంకర్, అలేఖ్య, రాజేష్, దీక్షిత్ తదితరులకు పాల్గొన్నారు.

పార్ట్‌నర్ షిప్ సమ్మిట్ పనులు పూర్తి చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో చేపడుతున్న పార్ట్నర్షిప్ సమ్మిట్ పనులను,ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయానికే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధానకార్యాలయం సమావేశ మందిరంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం పై అదనపు కమిషనర్ ఎస్.ఎస్ వర్మ, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, ఇతర అధికారులతో కలిసి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా నవంబర్ నెలలో జరగనున్న పార్ట్నర్షిప్ సమ్మిట్ ఎంతోకాలం లేదని, సమ్మిట్ కు ఎంతోమంది ప్రముఖులు నగరానికి వస్తారని, అందుకు విశాఖ నగరాన్ని ఆకర్షణీయమైన సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అందుకు చేపడుతున్న రోడ్లు ,ఫుట్ పాత్ ల నిర్మాణం, మరమ్మత్తులు, సెంటర్ మీడియన్, ఐలాండ్ లలో ఆకర్షణమైన మొక్కలు, పెయింటింగ్, విద్యుత్ కాంతులు మొదలైన పనులు నాణ్యతలో రాజీ లేకుండా నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చూడాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీరును ఆదేశించారు. పార్ట్నర్షిప్ సమ్మిట్ కు సమయం తక్కువగా ఉన్నందున, ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్న సమయంలో అభివృద్ధి పనులు క్వాలిటీ కంట్రోల్ చేపడుతూ నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని, ఏర్పాటులలో ఎటువంటి లోటుపాట్లు, అడ్డంకులు లేకుండా ముందస్తు ప్రణాళికలతో సంబంధిత విభాగాల సంయుక్త కార్యాచరణతో సూచించిన పనులను పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ లంగ్స్ 2.0 లో భాగంగా రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారి ఆక్రమణలను తొలగించిన నేపథ్యంలో అర్హులుగా గుర్తించిన వీధివిక్రయదారుల కొరకు టౌన్ ప్లానింగ్ విభాగం సూచించిన స్ట్రీట్ వెండింగ్ జోన్లను పరిశీలించి మౌలిక సదుపాయాలతో కూడిన మంచి ఆకృతులతో, ఆకర్షణీయంగా వెండింగ్ జోన్లు ఏర్పాటుకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. హార్టికల్చర్ విభాగం సమ్మిట్ కొరకు పచ్చదనంతో, అందమైన మొక్కలతో చేపడుతున్న సెంటర్ మీడియన్, ఐలాండ్స్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిడిహెచ్ దామోదర రావు కు కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్లు రాయల్ బాబు, సంపత్ కుమార్, గోవిందరావు, జివిఎంసి కార్యనిర్వహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమమైన ఫలితాలు అవసరం

విశాలాంధ్ర - ఆనందపురం: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల చిట్టి వలస పదవ తరగతి విద్యార్థులు గృహ సందర్శన పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థినులు ఇళ్ళను పాఠశాల ఉపాధ్యాయినుల బృందం సందర్శించారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని వివరించి చెప్పడం జరిగింది. ఇటీవల జరిగిన ఎఫ్ ఎ-2 పరీక్షలలో విద్యార్థినుల మార్కులను తెలియజేస్తూ, రాబోయే పదవతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమమైన ఫలితాలను సాధించడానికి ఉపాధ్యాయులు అనుసరిస్తున్న విధానాన్ని, విద్యార్థుల తల్లితండ్రులకు వివరిస్తూ, వారి సహకారాన్ని కోరారు. సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకూ, ప్రధానోపాధ్యాయులుశివ జ్యోతి , ఆద్వర్యంలో సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో ప్రపంచ అనస్తీషియా దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో అనస్తీషియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రజలకు సీపీఆర్ (హృదయ పునరుద్ధరణ) పట్ల అవగాహన కల్పించబడింది. అనస్థీషియా వైద్యులు, సిబ్బంది సీపీఆర్ ప్రాక్టికల్ ప్రదర్శనలు చూపించి గుండె పోటు వచ్చిన సందర్భాల్లో తక్షణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. కాగా అక్టోబర్ 13 నుండి 17 వరకు సీపీఆర్ అవగాహన వారంగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ఈ సందర్భంగా సీపీఆర్ ప్రతిజ్ఞ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో హెచ్ఓడి డాక్టర్ పద్మా అమర్ విశాల్ నాయకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చెంచి రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా దేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణ ప్రకాష్, డాక్టర్ నరేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

లక్కీ గోవింద్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్కీ గోవింద్‌ను పెందుర్తి నియోజకవర్గం యాదవ సంఘం ఘనంగా సత్కరించింది. పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, పెందుర్తి నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షులు, జడ్పిటిసి ఉప్పిలి కనకరాజు, పెందుర్తి మండలం యాదవ సంఘం అధ్యక్షులు చందక చలపతి, వీతల విష్ణు, పెందుర్తి తెలుగు యువత అధ్యక్షులు కోటిబాని శ్రీనివాస్, అయితి ఏర్ని బాబు, కాగితి ఏర్ని బాబు, దుర్గాప్రసాద్, చీర రాజు తదితర యాదవ సంఘం పెద్దలు లక్కీ గోవింద్ ను శాలువాలతో సత్కరించి అభినందనలు తెపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ లక్కీ గోవిందు యాదవ సంఘానికి, అలాగే సమాజానికి ఎంతో సేవ చేసారని కొనియాడారు. స్థానికంగా పలు దేవాలయాల నిర్మాణం, పాత ఆలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తనిష్క్ నుంచి రివా ఆధునిక వివాహ, పండుగ ఆభరణాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: తనిష్క్ యొక్క ప్రత్యేకమైన పండుగ సందర్భంగా, వివాహ బ్రాండ్, రివా ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తనిష్క్ చీఫ్ డిజైన్ ఆఫీసర్ రేవతి కాంత్ చెప్పారు. ఆధునిక రూపకల్పనను స్వీకరించేటప్పుడు వారసత్వ హస్తకళ యొక్క గొప్పతనాన్ని జరుపుకునే వివాహ, పండుగ ఆభరణాల యొక్క అద్భుతమైన క్యూరేషన్‌ను ఆవిష్కరించామన్నారు. దీపావళి, రాబోయే వివాహ ముహూర్తామ్ తేదీలకు తనిష్క్ రివా ప్రతి క్షణం ఆభరణాల నుండి ఆభరణాలను సన్నిహితమైన వివాహానికి పూర్వ ఆచారాల నుండి గొప్ప వివాహ వేడుకల వరకు ప్రదర్శిస్తుందన్నారు. పున ఐఎంపి రూపకల్పన చేసిన కసుమాలా, టెంపుల్ జ్యువెలరీ శ్రేణి, ప్రతి వివాహ సందర్భంలో శుభంగా, లేయర్డ్ హారామ్స్, పురాతన చోకర్స్, బ్రైడల్ బ్యాంగ్, వడ్డ్యామ్స్ మరియు హమ్మిస్ ఉన్నాయన్నారు. ప్రతి ముక్క పురాతన హస్తకళ ఆకృతి గల బంగారంతో చిత్తశుద్ధితో రూపొందించబడిందని, వారసత్వ మూలాంశాలు వయస్సు పాత నకాషి మరియు స్టోన్ వర్క్ పద్ధతుల ద్వారా ప్రాణం పోసుకున్నాయన్నారు. రేఖాగణిత చెవిపోగులు, తేలికపాటి పెండెంట్లు, రింగులు, సొగసైన గాజులు, బంగారు, వజ్రాలలో కంకణాలు కార్యాలయం మరియు సాధారణం విహారయాత్రలకు అనువైన రోజువారీ దుస్తులు శ్రేణిని అందిస్తోందని అన్నారు. దీనిపై ఆఫర్లు ఈ నెల 21 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

గ్లోబల్ బ్రాండ్స్‌లో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్‌కి 5వ ర్యాంక్

విశాలాంధ్ర - విశాఖపట్నం: గ్లోబల్ బ్రాండ్ కన్సల్టెన్సీ ఇంటర్‌బ్రాండ్ ప్రకటించిన 'బెస్ట్ గ్లోబల్ బ్రాండ్స్' జాబితాలో తమకు 5వ ర్యాంక్ లభించినట్లు శాంసంగ్ నేడు వెల్లడించింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఇదే స్థానాన్ని నిలబెట్టుకోవడం గమనార్హం. ఈ సంవత్సరం జాబితాలో, శాంసంగ్ 90.5 బిలియన్ల బ్రాండ్ విలువను నమోదు చేసింది. 2020 నుండి ప్రపంచ టాప్ 5లో స్థానం నిలబెట్టుకున్న ఏకైక ఆసియా కంపెనీగా శాంసంగ్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఇంటర్‌బ్రాండ్ ప్రకారం, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ యొక్క సానుకూల మూల్యాంకనానికి కంపెనీ యొక్క అన్ని వ్యాపార విభాగాలలో ఏఐ పోటీతత్వాన్ని బలోపేతం చేసుకోవడం, ఉత్పత్తుల మధ్య ఏకీకరణ ద్వారా వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడం, ఏ ఐ సంబంధిత సెమీకండక్టర్లపై ప్రత్యేకంగా పెట్టుబడులు పెట్టడం, వినియోగదారు కేంద్రీకృత బ్రాండ్ వ్యూహాన్ని అమలు చేయడం లాంటి అంశాల అమలు చేయడం వల్ల ఇది సాధ్యపడిందని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రెసిడెంట్, గ్లోబల్ మార్కెటింగ్ ఆఫీస్ హెడ్, వోన్ జిన్ లీ అన్నారు.

ఆదర్శలో ఐఓటీ అప్లికేషన్ వర్క్‌షాప్

విశాలాంధ్ర - పెందుర్తి, : పెందుర్తి ఆదర్శ డిగ్రీ కాలేజీలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పై వర్క్ షాప్ గురువారం ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగిందని ప్రిన్సిపాల్ ఎస్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజ్‌కి చెందిన ఎం.సాయి క్రిష్ణ, కే.సాయి మోహిత్, జే.చందు బాబు. టి.అశ్వినీ బీటెక్ విద్యార్థులు ఆర్డినో, ర్యాస్ బెర్రీపై మౌలిక ప్రయోగాలు చేసి విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారని ప్రిన్సిపల్ తెలిపారు. ఐఓటీ అనేది ప్రస్తుతం,భవిష్యత్తు లో సాంకేతిక రంగంలో విశేష ఆదరణ ఉంటుందని దాని ప్రాముఖ్యత మొదలగు విషయాలను తెలియజేశారు. ఈ వర్క్ షాప్‌లో బీఎస్సీ, బిసిఎ నుండి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రాజ్ కుమార్ ఐఓటీ ప్రయోజనాలను వివరించారు. కంప్యూటర్ యుగంలో టెక్నాలజీ లేని మానవ జీవితాన్ని ఊహించుకోలేమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ మాటాడుతూ ఇటువంటి వర్క్ షాప్ లు నిర్వహిస్తూ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో ఆంధ్రా యూనివర్సిటీ సహకారంతో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ అడ్వాన్స్ టెక్నాలజీపై నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో ఫ్యాకల్టీ రాజేశ్వరరావు, శ్రీనివాస్ రావు రవిబాబు, కంప్యూటర్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.